
మహాతలం..
మాయాదర్పణం
శ్రీసుధామయి




# మహాతలం...మాయాదర్పణం

**ఒ**క్కసారిగా ప్రకృతి విలయతాండవం ...దట్టంగా అలుముకున్న మేఘాలు ..కుంభవృష్టి.

ఆ మెరుపుల్లో పర్వతప్రాంతంలో  భూమిలోపల చిన్న కదలిక .భూమి కంపిస్తుంది.రెండుగా చీలుతుందా అన్నంత భయానక  వాతావరణంలో భూమి పొరలను చీల్చుకుని మా...యా...ద...ర్ప...ణం బయల్పడింది. కుండపోతగా కురిసేవర్షానికి మాయాదర్పణం మీద వున్న బురద తొలిగింది.

**ఆకాశంలోని మెరుపులు ..కుంభవృష్టి మేఘాలు ఒక్కసారిగా ఎదో బలమైన శక్తి లాగినట్టు మయాదర్పణంలోకి లాగబడ్డాయి. మాయాదర్పణంలో ఏ ప్రతిబింబం కనిపిస్తే ఆ ఆకారాన్ని మాయాదర్పణం లోనికి లాగేస్తుంది.**

**మరుక్షణం ఆ మయాదర్పణాన్ని భూమి తనలోకి లాక్కుంది.ఆకాశంలో మెరుపులు మేఘాలు మాయమయ్యాయి.**

***

ప్రకృతి విలయం మొదలైందా అన్నట్టుంది భీకరమైన వాతావరణం. భీభత్సమైన విలయతాండవంతో పుడమితల్లి తల్లడిల్లడం ఆరంభమైంది. హోరుగాలులు బలంగా వీస్తూ పెద్ద పెద్ద వృక్షాలను కూకటివేళ్లతో పెకిలించి నేలకూలుస్తున్నాయి. అడవులలోని జంతుజాలం ప్రాణభయంతో తోచినరీతిలో పరుగులు తీస్తున్నాయి. బలమైన ఈదురుగాలులు వాయువేగంతో పయనిస్తూ వాటి ప్రభావాన్ని ప్రకృతిపై చూపుతున్నాయి.

ఆకాశం నిండా కరిమబ్బులు కమ్ముకుంటున్నాయి. ఒక్కసారిగా చీకటి అలుముకున్నట్టు నల్లని మబ్బులు దట్టంగా అలముకుని జగత్తును చీకటిమయం చేశాయి. ఈ ప్రకృతి భీభత్సాన్ని చూస్తూ అన్ని రాజ్యాల ప్రజలు అన్ని దేశాల జనులు భయకంపితులవుతున్నారు. సమస్త మానవాళిని భయభ్రాంతులను

చేస్తున్న ప్రకృతి విలయం క్రమక్రమంగా ఎక్కువవుతోంది.

ఈదురుగాలులు క్రమంగా తగ్గిపోతూ వర్షం సన్నగా ఆరంభమైంది. అలా మొదలైన వాన జడివానగా మారుతుండగా ఆకాశం ఫెళఫెళరావాలతో గర్జించడం మొదలుపెట్టింది.

***

ఉరుములు మెరుపులు ఆకాశం నిండా కమ్ముకుంటున్నాయి. చీకటి కమ్ముకుని గాఢాంధకారంలో మునిగి ఉన్న భూమి నింగిలోని మెరుపులతో అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తోంది. పిడుగులు అశనిపాతాలు నింగి నుండి నేలపైకి దూసుకువస్తూ జనావళిని భయభ్రాంతులను చేస్తున్నాయి. పిడుగుపాట్లకు అన్ని దేశాల ప్రజలు వణికిపోతున్నారు. ఉరుములతో భీకరంగా గర్జిస్తోన్న ఆకాశం అంతకంతకూ మరింత ఎక్కువగా ఉరమడం మొదలుపెట్టింది.

లిప్తకాలం పాటు మెరుస్తున్న మెరుపుతీగలు భూమిని తాకుతూ వెలుగులు చిమ్ముతున్నాయి. భూమి మీద ఉండే సమస్త జనులు ఏం జరుగుతుందో ఏం జరగబోతోందో అనే ఆందోళనతో తల్లడిల్లుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు. ఉరుముల ధాటికి ఉలిక్కిపడుతూ మెరుపుల ధాటికి మిరుమిట్లు గొలుపుతున్న ప్రకృతిని చూసి భయవిహ్వాలులవుతూ ఉన్నారు.

అన్ని దేశాలలో ఒకే తీరుగా కుండపోత వర్షం మొదలైంది. ఒక దేశం

నుండి ఇంకొక దేశానికి వర్తమానం అందించే వీలు కూడా లేకుండా జడివాన జడిపిస్తోంది. ఇలాంటి ప్రకృతి విలయాన్ని తామెప్పుడూ కనీ వినీ ఎరుగమని తల పండిన వృద్ధులు చెప్తున్నారు. అన్ని దేశాల రాజులు ప్రభువులు ఈ విపత్కర పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో అర్థం కాక కుదేలవుతున్నారు. ఆస్థాన పండితులను దైవజ్ఞులను ఆహ్వానించి వారి ద్వారా ప్రకృతి ప్రకోపానికి కారణాలు అన్వేషిస్తున్నారు.

జడివాన కుండపోతగా కురవడం అంతకంతకూ పెరుగుతోంది. మిన్ను మన్ను ఏకమై సముద్రాలు ఉప్పొంగుతున్నాయి. నల్లని కారుమబ్బులతో ఆకాశం అనంతమైన చీకటిని తనలో దాచుకున్నట్టు కనిపిస్తోంది. నల్లని మబ్బులు కదులుతూ వర్షించడమే కాక మరింత కారు మబ్బులుగా మారిపోతున్నాయి.

సమస్త జగత్తు సకల జనావళి వానలో తడిసి ముద్దవుతున్నారు. కంటికి కనిపించని వేగంతో కదిలే మెరుపులు భీకరంగా గర్జిస్తూ నేలలోనికి చొచ్చుకుపోతున్నాయి. ఉరుములు తమ ప్రతాపాన్ని భూమి మీద ప్రదర్శిస్తున్నాయి. ఆ ఉరుముల ధాటికి వృద్ధులు పసిపిల్లలతో సహా అందరూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారు.

***

ఆకాశాన్ని చీల్చుకుంటూ కనులు మిరుమిట్లు గొలిపేలా మెరుపుతీగలు భూమిని తాకుతుండగా వాటి ప్రభావానికి అనేక కట్టడాలు ఇళ్లు నేలమట్టం అవుతున్నాయి. ఎత్తయిన వృక్షాల మీద పడుతున్న పిడుగుపాట్లకు ఒక్కసారిగా ఆ వృక్షాలన్నీ నేలకూలిపోతున్నాయి. భీభత్సమైన ప్రకృతి వాతావరణాన్ని చూసి జనులు తమ తమ నివాసాలలో ఉండటానికి కూడా భయపడిపోవటం మొదలైంది. అన్ని దేశాల రాజులు అన్ని రాజ్యాల ప్రజలు దేవుడిని ప్రార్థించడం మొదలుపెట్టారు.

* * *

అది మాణిక్యపురి రాజ్యం. కుండపోత వర్షం కుంభవృష్టిగా కురుస్తూ మాణిక్యపురిని ముంచెత్తుతోంది. అనుకోని ప్రకృతి విపత్తుకు మాణిక్యపురి ప్రజలు భీతిల్లుతున్నారు. నింగి కడవలతో నీటిని గుమ్మరిస్తోందా అన్నట్టుంది అక్కడి వాతావరణం. ఆకాశం నుండి వెలువడుతున్న మెరుపుల వలన ఎన్నో భవనాలు వృక్షాలు కూలిపోతున్నాయి.

మాణిక్యపురి మహారాజు ధీరసేనుడి రాజకోట. సభలో మహారాణి చంద్రవదన తో సహా మహామంత్రి సేనాని మిగిలిన అందరూ కొలువు తీరి ఉన్నారు. మహారాణి చంద్రవదన చింతాక్రాంతురాలై ఉండగా మిగిలిన సభాసదులందరూ ఎవరి ఆలోచనలలో వారు మునిగి

ఉండగా.. హఠాత్తుగా ఆకాశం ఫెళఫెళరావాలతో గర్జించింది.

ఆ ఉరుముల ధాటికి రాజభవనం కోట ముందుభాగంలో పెద్దదైన శబ్దంతో  బురుజు కూలిపోయింది. ఆ శబ్దం విని అందరూ భయభ్రాంతులయ్యారు.

ఆ ఉరుములు మెరుపులు విలయం చూసి మహారాణి చంద్రవదన ఇంకా దిగులుతో స్పృహ తప్పి పడిపోయింది.

స్పృహ తప్పిన మహారాణి చంద్రవదన ను చూసి మహారాజు ధీరసేనుడు కలవరపడ్డాడు. మహారాణి అలా స్పృహ తప్పడం చూసిన అందరూ చింతాక్రాంతులై నిలబడిపోయారు.

చెలికత్తెలు మహారాణికి పరిచర్యలు చేస్తుండగా.. అంతకు నాలుగురోజుల ముందు రోజు జరిగిన సంఘటన మహారాజు ధీరసేనుడికి కళ్లకు కట్టినట్టు కనిపించసాగింది.

ఆ రోజు ఉదయం కోటలో మాత్రమే కాక మాణిక్యపురి రాజ్యం మొత్తం సంబరాలు జరుపుకుంటోంది. ఎటు చూసినా కోలాహలంగా సందడిగా ఉంది. రాజ్యంలో ఎక్కడ చూసినా స్వాగతతోరణాలు దర్శనమిస్తున్నాయి. పూలహారాలతో అలంకరించిన తోరణాలు, పూమాలలతో నిండి ఉన్న వీధులు, రాజ్యంలో ప్రజలందరూ హడావుడిగా అటూ ఇటూ తిరుగుతూ స్వాగతం పలకడానికి సన్నద్ధమయ్యారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Mahatalam+Maya+Darpanam](http://kinige.com/book/Mahatalam+Maya+Darpanam)

* * *